

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**ఇత్‌నీ హసీన్ ఇత్‌నీ జవాన్ రాత్ క్యాకరే?**

**జాగే హై కుఛ్ అజీబ్‌సి జుజ్బాత్ క్యా కరే?**

ఇది గమ్మత్తయిన అనుభవం. రాత్రంతా మేల్కొనే పాటలు అన్నీ విషాదభరితాలు కావు. అన్నీ ఆనందమయం కావు. రాత్రంతా మేల్కొని ఈయన ఏం ఆలోచిస్తున్నాడంటే, ఇంత అందమయిన రాత్రంతా ఏం చేయాలి? ఎలా గడపాలి? అని!

'ఆజ్ ఔర్ కల్' కమర్షియల్ ఫార్ములా పరిధిలోనే ఉండే ఒక విభిన్నమైన సినిమా. అశోక్ కుమార్ పాత్ర క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తుంది. దాంతో అతని సంతానం అతనిపై ద్వేషంతో పెరుగుతారు. మానసికంగా బాధపడుతూంటారు. ఒక కూతురు 'నంద' కాళ్లు కదపలేకపోతుంది. ఆమెకు వైద్యం చేయటం కోసం సునీల్ దత్ పాత్ర రంగ ప్రవేశం చేస్తుంది. జీవించేందుకు 'నవ్వు' అత్యంత ప్రాధాన్యం వహిస్తుందని నమ్మే పాత్ర సునీల్ దత్. అతని రంగప్రవేశంతో ఇంట్లో వాతావరణం మారుతుంది. కానీ డాక్టర్– రోగి పరిధి దాటి నంద పాత్రతో ప్రేమలో పడుతుంది సునీల్ దత్ పాత్ర. వారి ప్రేమ ఇంకా స్పష్టమైన రూపు ధరించకముందు వచ్చే పాట ఇది.

అందమైన రాత్రి. వెన్నెల విరగబూస్తూంటుంది. నాయిక కాళ్లు కదపలేనిదయినా అందమైనది. యువతి. ఆమెలో ఒకరకమైన vulnerability స్పష్టంగా కనిపిస్తూంటుంది. ఆమెని దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పాలన్న భావన బలంగా కలుగుతూంటుంది చూసిన ప్రతివారిలో. అలాంటిది ఆమెకి దగ్గరగా ఉంటూ వైద్యం చేసే యువ డాక్టర్‌లో ఆమె పట్ల ప్రేమ భావనలు జనించటంలో ఆశ్చర్యంలేదు. ఇక్కడే పాటలో వ్యక్తపరచిన భావనల ప్రాధాన్యం స్పష్టమవుతుంది. పాట హృదయానికి మరింత దగ్గరవుతుంది.

'ఆజ్ ఔర్ కల్' సినిమాకు సంగీత దర్శకుడు రవి. హిందీ సినీ సంగీత స్వర్ణ యుగంలో ప్రధాన పాత్ర పోషించిన సంగీత దర్శకుడు రవి. కానీ ఎన్నో హిట్ పాటలను, మరపురాని మధుర గీతాలను రూపొందించి కూడా ద్వితీయ శ్రేణి సంగీత దర్శకుడిగా మిగిలిపోయిన వాడు రవి. నిజానికి రవి రూపొందించిన పాటలు వింటూంటే అతి తక్కువ ఆర్కెస్ట్రాను అత్యంత సృజనాత్మకంగా వాడుతూ అతిమధురమైన పాటలను రూపొందించిన తీరుకు ఆశ్చర్యం కల్గుతుంది. అతని పాటల జాబితా ఏ అగ్రశ్రేణి సంగీత దర్శకుడి పాటల జాబితాకు తీసిపోదు. కానీ అగ్రశ్రేణి సంగీత దర్శకుడిగా గుర్తింపు

పొందక పోవటానికి ప్రధాన కారణం ఎలాంటి అహంకారం, భేషజాలు లేని రవి ప్రవర్తన. అతని వ్యక్తిత్వం. డిమాండ్ చేయకుండా సినిమాలు ఒప్పేసుకోవటం, నిర్మాతల స్థాయితో సంబంధం లేకుండా 'అహం' లేకుండా ఉండటం, రాజీపడటం వంటివి అతనికి దక్కాల్సిన గౌరవం దక్కకపోవటంలో తమ వంతు పాత్ర పోషించాయి. సినిమాను 'షో బిజినెస్' అంటారు. ఇక్కడ అట్టహాసాలకు, ఆడంబరాలకు పెద్దపీట. అవేవీ లేని 'రవి' ఎంతో ప్రతిభ ఉండికూడా, విజయవంతమైన సినిమాలకి పని చేసికూడా ద్వితీయ శ్రేణిలో మిగిలిపోయాడు. కానీ, అనేక సినిమాలు ఈనాటికీ సజీవంగా ఉండటానికి ఏకైక కారణం రవి రూపొందించిన పాటలు మాత్రమే.

ఈ పాటను రాసింది సాహిర్ లూధియాన్వీ. రచయితలు లేకుంటే ఆరంభమే కాని సినీ ప్రపంచంలో అస్సలు విలువలేనిది రచయితలకే. అలాంటి సినీ ప్రపంచంలో పెద్దపెద్ద స్టార్ల కన్నా ఎక్కువగా డిమాండ్ చూపిస్తూ, తాను 'ఆడింది ఆట, పాడింది పాట'గా నడిపించుకున్న ఏకైక రచయిత సాహిర్ లూధియాన్వీ. పాటలో నటీనటులు గాయనీగాయకులు సంగీత దర్శకులకన్నా అధికంగా 'గేయరచయిత' కనబడటం సాహిర్ లూధియాన్వీ ప్రత్యేకత. వినగానే ఇది 'సాహిర్ పాట' అని గుర్తించే పాట, 'సాహిర్ పాట'గా గుర్తింపు పొందే పాటలు అతనివి. ఈ గౌరవం ఇతర ఏ సినీ గేయరచయితకు దక్కలేదు. సాహిర్ సినీ పాటలు తనకు నచ్చినట్టు రాశాడు. పాటలు రాసేముందు స్క్రిప్టు తాను చూసి ఆమోదించాలని పట్టుబట్టేవాడు. సంగీత దర్శకుడు తన పాటలకు తాను మెచ్చే బాణీలు ఇవ్వాలని డిమాండ్ చేసేవాడు. ఇవేవీ నచ్చకపోతే 'పాటలు రాయను పొమ్మ'నేవాడు అంతేకాదు సినిమాలో పాటలన్నీ తానే రాసేవాడు. మరో గేయరచయత పేరు తన పేరుతో కనబడేందుకు ఒప్పుకునేవాడు కాదు. అతని అన్ని నియమ నిబంధనలకు ఒప్పుకుని అతనితో పనిచేసేవారు. ఎందుకంటే, కేవలం పాటలలో పదాల ద్వారా సినిమాను హిట్ చేయటమే కాదు చిరంజీవిగా నిలపగలిగిన ఏకైక గేయ రచయిత సాహిర్ కాబట్టి. ప్రేమ గీతాలలో ప్రేమ ప్రసక్తి లేకుండా ప్రకృతిని వర్ణిస్తూ ప్రేమ భావనలోని ప్రాకృతికను ప్రదర్శిస్తాడు సాహిర్. అలాంటి భావనలను అతి సున్నితంగా ప్రదర్శించిన పాట ఇది.

సాహిర్, రవిల కలయికలో అత్యద్భుతమైన పాటలు రూపొందాయి. ఆ అత్యద్భుతమైన పాటలలో ఒకటి 'ఇత్‌నీ హసీన్ ఇత్‌నీ జవాన్ రాత్ క్యాకరే!' నాయిక కాళ్లు చచ్చుబడిపోతాయి ఆమె నడవలేదు. కానీ ఆమె అందం, అమాయకత్వం నాయకుడిని ఆకర్షిస్తాయి. అతడు ఆతడు ఆమెకు వైద్యం చేసేందుకు వస్తాడు. కానీ మనసులో చెలరేగే భావనలకు బాధ్యతలు, నియమ నిబంధనలు, పరిధులు, పరిమితులు తెలియవు. అందుకే ఒక వెన్నెల రాత్రి, నిద్రరాని రాత్రి ఒంటరిగా నిలచి తన మనసులో చెలరేగే భావనలను పాట రూపంలో గొంతెత్తి పాడుకోవటం ఆరంభిస్తాడు.

ఇంత అందమైన రాత్రి ఏం చేయాలి? మనసులో మధురమైన అలవికాని భావనలు చెలరేగుతున్నాయి. ఏం చేయాలి? అంటున్నాడు నాయకుడు. ఇలాంటి సందర్భమే 'ఘర్ నెం 44 ' సినిమాలో వస్తుంది. ఆ సినిమాలో నాయకుడికి నాయికపై ప్రేమ భావన కలుగుతుంది. కానీ నాయకుడు బికారీ. ఉండటానికి ఇల్లుకూడా ఉండదు. పార్కులో

బెంచిపై పడుకుంటాడు. పైన ఆకాశం, నక్షత్రాలు.. క్రింద నేల. అయినా మనసులో ప్రేమ భావన గిలిగింతలు పెడుతూంటుంది. నిద్రరాదు. ప్రేమ భావనకు సామాజిక స్థాయి, ఆకలి, రేపెలాగ? అన్న ఆలోచనలు తెలియవు. అందుకే తినటానికి తిండి, ఉండటానికి ఇల్లు లేని హీరో, పార్కులో బెంచిపై పడుకుని ఆకాశాన్ని చూస్తూ మధురంగా, హేమంత్‌కుమార్ గొంతులో సాహిర్ పాటను పాడతాడు. సంగీత దర్శకత్వం ఎస్డీబర్మన్.

**చుప్ హై ధర్తీ, చుప్ హై యే చాంద్ సితారే..**

**మేరే దిల్‌కీ ధడ్‌కన్ తుఝుకో పుకారే...**

ధరిత్రి నిశ్శబ్దంగా ఉంది. చంద్రుడు, తారలు నిశ్శబ్దంగా ఉన్నాయి. కానీ నా హృదయం మాత్రం నిన్ను పిలుస్తోంది. ధడక్‌న్ అంటే హార్ట్ బీట్ . ఇది సాహిర్ ప్రేమగీతాలు రచించే పద్ధతి.

'ఆజ్ ఔర్ కల్' సినిమాలో ఈ అందమైన రాత్రి, మనసులో మధురోహలు కలుగుతున్న రాత్రి ఏం చేయాలి? ఎలా గడపాలి?' అంటూ ఆరంభిస్తాడు పాటని. 'ఘర్ నెం 44 'లో 'రాత్రి, ఆకాశం, చంద్రుడు, తారలు నిశ్శబ్ధంగా ఉన్నాయి. నా హృదయం నిన్ను పిలుస్తోంది' అంటున్నాడు.

'ఆజ్ ఔర్ కల్' సినిమాలో నాయకుడి భావనలలో సందిగ్ధం ఉంది. అందుకని సందేహం వ్యక్తపరుస్తున్నాడు. 'ఘర్ నెం 44 'లో అలాంటి సందేహాలు లేవు. అందుకని ఆమెను అతని హృదయం పిలుస్తోంది. ఇక్కడ నటుల మేనరిజమ్స్, వారి పాత్రల వ్యక్తిత్వాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. 'ఆజ్ ఔర్ కల్'లో నాయకుడు విద్యావంతుడు. సంస్కారం ఉన్నవాడు. ఆ పాత్రను వేసింది సునీల్‌దత్. సునీల్‌దత్‌లో ఓ రకమైన బిడియం కనిపిస్తుంది. అందుకని పాటలో కూడా ఆ బిడియం కనిపించాలి. పైగా, డాక్టర్, వైద్యం చేస్తున్నవాడు, తాను వైద్యం చేస్తున్న రోగిని ప్రేమించటం.. కాబట్టి సంస్కారవంతుడయిన ఆ డాక్టర్, తనలో చెలరేగుతున్న భావనలను అర్థం చేసుకోవాలని, అదుపులో పెట్టుకోవాలని ప్రయత్నించటం, ఆ భావనల వల్ల ఓ రకమైన సందిగ్ధానికి గురికావటం స్వాభావికం, అదే ఈ పాటలో కనిపిస్తోంది. నాయిక, నాయకుడు ఒంటరిగా ఉన్నారు. నాయిక తన గదిలో నిద్రిస్తూంటుంది. నాయకుడికి నిద్రరాదు. అందుకని ఇంట్లోంచి బయటకు వస్తాడు. బయట అందమైన రాత్రి, వెన్నెలను చూడగానే మనసులో మధురోహలు చెలరేగుతాయి. పాట అందుకుంటాడు.

'ఘర్ నెం 44 ' లో నాయకుడు ఇందుకు విభిన్నం. వాడు దొంగ. అనాథ. ఇల్లూ వాకిలి లేనివాడు. ఎక్కడబడితే అక్కడ తిరిగేవాడు. కాబట్టి అతని వ్యవహారాల్లో దోబూచులాటలు, సున్నిత భావనలు అతి తక్కువ ఉంటాయి. మనసులో మాటను తిన్నగా చెప్పేస్తాడు. అందుకే తన హృదయం ఆమెని పిలుస్తోందని గ్రహించాడు. ప్రకటిస్తున్నాడు.

**పేడోంకి బాజువోమే లచక్ తీ హై చాందినీ**

**బేచైన్ హో రహేహై ఖయాలాత్ క్యాకరే?**

చెట్ల కొమ్మలను భుజాలుగా భావిస్తున్నాడు. ఆ భుజాలపై మృదువుగా, మెత్తగా వెన్నెల పరచుకుని ఉంది. అది చూసి అతని ఆలోచనలలో ఒక అశాంతి, ఆతురత, చంచలత్వం ప్రవేశించాయి. ఇప్పుడేం చేయాలి? అనుకుంటున్నాడు. అద్భుతమైన ఊహ. ఒక్క సాహిర్ మాత్రమే ఇలా రాయగలడు. చెట్ల భుజాలపై పరచుకుని ఉన్న మృదువైన వెన్నెలను చూస్తే మనసులో సున్నిత భావనలు జాగృతమై కలవరం కలుగుతోంది. ఎందుకని? వెన్నెల యువతి. చెట్ల భుజాలపై తలపెట్టుకున్న యువతి వెన్నెల. ఆమె అతని భుజంపై తల ఆనించాలన్న కోరిక కలుగుతోంది. అదీ సంగతి. అంత మృదువైన భావనకు, అంతే సున్నితంగా వ్యక్తపరుస్తున్నాడు నాయకుడు.

**ఖోయే కోయే సే యే మస్త్ నజారే**

**ఠహరే ఠహరే సే యే రంగ్ కె ధారే**

**ఢూంఢ్ రహేహై తుఝుకో సాథ్ హమారే**

నాయకుడు అంత విద్యావంతుడు కాకపోతేనేమి? ఇల్లూ వాకిలి లేని ఆవారా అయితేనేమి? సంస్కారహీనుడు కాడు. సాహిర్ పాట పాడేవాడు ఎంత అట్టడుగున ఉన్నవాడయినా సంస్కారవంతుడు కాకుండా ఎలా ఉంటాడు? అందుకే నాయికను తిన్నగా పిలిస్తూనా్నా మనసులో చెలరేగే భావనలను అతి సున్నితంగా ప్రకటిస్తున్నాడు. అందమైన ప్రకృతి దృశ్యాలు కూడా ఏదో కోల్పోయినట్టు ఉదాసీనంగా అనిపిస్తున్నాయి. రంగులు కూడా చంచలత్వం కోల్పోయినట్టు కనిపిస్తున్నాయి. అవన్నీ ఏదో కోల్పోయినట్టో, వెలిసిపోయినట్టో ఉండటానికి కారణం ఆమె అతని పక్కన లేకపోవటమే. ఆమె కోసం అవి అతనితోపాటూ వెతుకుతున్నాయట. అందుకని అతని హృదయం ఆమెని పిలుస్తోంది.

**సాంసోమే ఘుల్ రహీహై కిసీ సాంస్‌కీ మహక్**

**దామన్ కొ ఛూ రహోహై కొయీ హాథ్ క్యాకరే.**

అతని శ్వాసలో మరొకరి పరిమళభరితమైన శ్వాస కలసి పరిమళిస్తోంది. అద్భుతమైన భావన. అతని చేయిని మరెవరి హస్తమో స్పృశిస్తోంది. ఈ భావనల్లోని మధురిమను అనుభవించాల్సిందే తప్ప వివరించటం కుదరదు. ఆమె గురించిన అతని భావనలు ఇంకా స్పష్టం కాలేదు. అందుకని తన శ్వాసలో కలిసే పరిమళభరితమైన శ్వాస ఎవరిదో, తన హస్తాన్ని స్పృశించే ఆ మృదువైన హస్తం ఎవరిదో, స్పష్టంగా ప్రకటించటంలేదు. సూచన ప్రాయంగా చెప్తున్నాడంతే. అంత సున్నితం సాహిర్ రచన.

**కోనే కోనే మస్తీ ఫైల్ రహీహై**

**బాహే బన్‌కర్ హస్తీ ఫైల్ రహీహై**

**తుఝుబిన్ దూబే దిల్‌కో కౌన్ ఉభారే.**

నలుమూలలా చైతన్యం విస్తరిస్తోంది. ఇక్కడ 'హస్తీ ' అంటే 'జీవం'గా కూడా అర్ధం వస్తుంది. నలుమూలలా చైతన్యం విస్తరిస్తోంది. బాహువులు చూస్తూ జీవం విస్తరిస్తోంది. కానీ ఆమె లేకుండా దిగులు పడి ఉన్న అతని హృదయాన్ని ఎవరు రక్షిస్తారు? ఎవరు ఆనందపరుస్తారు? ఆమెనే. ఇంకెవరు?

**షాయద్ తుమ్హారె ఆనె సే యే భేద్ ఖుల్ సకే.**

**హైరాన్ హూ కి ఆజ్ నయీ బాత్ క్యా కరే?**

చివరి చరణం పరమాద్భుతమైనది ప్రేమ భావాన్ని  అనుభవించినవారు మరింతగా ఈ చరణం భావాన్ని అనుభవిస్తారు, అర్ధం చేసుకుంటారు. ప్రేమలో ఉన్నవారు ఎడబాటును భరించలేరు. అనుక్షణం, ప్రొద్దస్తమానం కలసి ఉండాలని ఉంటుంది. మాట్లాడుతుండాలని ఉంటుంది. కానీ వారు కలిసే సమయం తక్కువ కానీ రోజూ కలుస్తూండటంతో, ఆ కలిసిన సమయం ఆమెకి ఆసక్తిగా ఉండటం కోసం ఏం చేయాలి? ఎలాంటి కబుర్లు చెప్పాలి? ఆమెను తన పట్ల ఆకర్షణ పెంచేందుకు ఎలాంటి చమత్కారాలు చేయాలి అన్నది నిరంతరం ప్రియుడిని వేధించే ప్రశ్న. ఆమెకు తన సాంగత్యం విసుగు అనిపిస్తే ఎలా? ఇన్ని రకాల ఆలోచనలు, ఆందోళనలు, పథకాలు వేస్తాడు ప్రియుడు. కానీ తీరా ఆమె వచ్చిన తరువాత సమయం ఎలా గడుస్తుందో తెలియదు. గడచిపోతుంది. ఒక్కమాట మాట్లాడకుండా నిశ్శబ్దంలో గంటలు దొర్లిపోతాయి. తీరా ఆమె వెళ్లిపోయిన తరువాత చెప్పాలనుకున్న మాటలు చెప్పకుండానే మిగిలిపోతాయి. నిరాశ కలుగుతుంది. మళ్లీ కలవాలనిపిస్తుంది. కలయిక కోసం ఎదురు చూపులు మొదలవుతాయి. అందుకే ఈ రోజు కొత్తమాటలు ఏం మాట్లాడాలన్న సందిగ్ధం ఆమె రావటంతోటే తీరుతుంది. అదే అంటున్నాడు హీరో. అదీగాక ఇక్కడ ఆమె ఎవరో తెలియదు. ఎవరి పరిమళం తన శ్వాసలో కలుస్తోందో తెలియదు. ఎవరు తన హస్తాన్ని స్పృశిస్తున్నారో తెలియదు. ఆమె వస్తేనే ఈ రహస్యం విడిపోతుంది. అప్పుడే కొత్త విషయం మాట్లాడాలోనని ఆలోచిస్తున్నాడు.ఎందుకంటే ఆమె వచ్చిన తర్వాత గంటలు క్షణాల్లో గడిచిపోతాయి. ఏం మాట్లాడాలన్న సమస్య రానేరాదు. అది ఆమె వచ్చేదాకానే కలిగే ఆలోచన. ఇదీ సాహిర్ ప్రేమ గీతాలు రాసే పద్ధతి. ఆ రాత్రంతా మేల్కొని వెన్నెలను చూస్తూ నాయికను ఊహిస్తూ నాయకుడు పాడే పాట.

**నిఖ్ రా నిఖ్ రా చాంద్ క్ జోబన్**

**బిఖ్ రా బిఖ్ రా నూర్ క దామన్**

**ఆ జా మేరే తన్ హాయి కే   సహారే...**

చంద్రుడి యవ్వనం, లావణ్యం, సౌందర్యం వికసిస్తోంది. వెన్నెల హస్తాలు విస్తరిస్తున్నాయి. జగతి అంతా పాకిపోతున్నాయి. 'ఒంటరితనంలో నా తోడు నీవు వచ్చేయి 'తన్ హాయి కే సహారే' అద్భుతమైన భావన. ఇది సాహిర్ దృష్టిలో ప్రేమ. ఒకరికి ఒకరు తోడుగా ఉండటం ప్రేమ. 'ఒంటరి తనంలో తోడు' .జగతి అంతా సంతోషం విస్తరిస్తోంది.

కాబట్టి 'నా ఒంటరితనంలో తోడు అని ఆమెను అభ్యర్ధిస్తున్నాడు. మన మనసులో ఎలాంటి భావన ఉంటే ప్రపంచం అలా కనిపిస్తుందంటారు. 'సాహిర్ ' దాన్నే వర్ణిస్తున్నాడు అత్యద్భుతమైన గేయ రచన పద్ధతి ఇది.

రెండు వేర్వేరు సినిమాలు. రెండు సందర్భాలు. రెండు విభిన్నమైన వ్యక్తిత్వాలు. ఒకే గేయరచయిత రెండు అత్యద్భుతమైన గేయాలను సృజించటం ఈ రెండు పాటలు ప్రదర్శిస్తాయి. పాటల చిత్రీకరణ కూడా విభిన్నంగా ఉంటుంది. 'ఇక్ నీ హసీన్ ' పాటలో విరగబూస్తున్న వెన్నెల కాబట్టి, తెర వెలుగుతో మెరిసిపోతుంది. అదే 'చుప్ హై ధర్తీ' పాటలో 'ఖోయే ఖోయ్ ', అంటాడు. చుప్ హై 'ధర్తీ' అంటాడు కాబట్టి తెరపై అంతగా వెలుతురుండదు. చెట్ల నీడల్లోంచి చీకటి నలుపులోంచి నాయకుడు అస్పష్టంగా కనిపిస్తూంటాడు. సునీల్‌దత్ ఈ పాటలో చేయాల్సిందల్లా ముఖంపై నవ్వు నింపుకోవటమే. ఎందుకంటే నటన అంతా నేపథ్యంలో రఫీ స్వరం చేస్తుంది. రఫీ – రవిల కలయికలో వచ్చిన పరమాద్భుతమైన రొమాంటిక్ పాటలలో ఇది ఒకటి. ఒకో పదాన్ని దాని భావం అనుభవిస్తూ, పదాలలో ఒదిగి ఉన్న రొమాంటిక్ భావనలకు ఉద్దీపననిస్తూ రఫీ పాడిన తీరు పాట మరింత 'అద్భుతం' అనిపించేట్టు చేస్తుంది. కొన్ని పదాలను ఒత్తి పలకటం, కొన్నిటిని సాగదీయటం, కొన్నిటిని మత్తుగా పలకటం, మరికొన్ని పదాలను తేలికగా పలకటం ఒక్క రఫీ తప్ప మరెవరూ పాడలేని గాన సంవిధానం ఇది. పాటలో ఒకో పదం వినటం ఒక అద్భుతమైన అనుభవం. ఏ ఒక్క పదాన్ని సరిగ్గా వినకున్నా పాట మాధుర్యాన్ని సంపూర్ణంగా అనుభవించలేము.

'చుప్ హై ధర్తీ' పాడింది హేమంత్ కుమార్. హేమంత్ కుమార్ గొంతులో ఓ రకమైన పవిత్ర భావన, కాస్త విషాద భావన కలగలసి ఉంటాయి. దాంతో 'చు హై ధరీ', పాట విలువ మరింత పెరిగి ఒక పవిత్రమైన రొమాంటిక్ గీతం వింటున్న భావన కలుగుతుంది. దీనికి తోడు దేవ్‌ఆనంద్ పాటలోని భావాన్ని అనుభవిస్తూ, పాటకు తాళం వేస్తూ తలను రిథమిక్‌గా అప్పుడప్పుడూ కదుపుతూ అభినయించిన తీరు పాట దర్శనానుభవాన్ని మరుపురానిదిగా చేస్తుంది. రఫీ పాటలో 'రొమాంటిక్ మత్తు' ఉంటే హేమంత్ కుమార్ స్వరంలో 'మెస్మరైజింగ్ రొమాన్స్ ' 'మనోమోహనకరమైన శృంగారం ' ఉంటుంది. రఫీ స్వరంలో ఎదను కలచివేసే మాధుర్యం ఉంటే, హేమంత్ కుమార్ స్వరంలో తీయని బాధ కలిగించే తీయదనం ఉంటుంది. రఫీ స్వరంలో ప్రేమకోసం యువహృదయం పడే తపనలోని ఆనందం ఉంటే, హేమంత్ కుమార్ స్వరంలో ప్రేమలో ఇమిడి ఉన్న ఒక రహస్యమైన ఆధ్యాత్మిక తత్వం ధ్వనిస్తుంది. అది 'చుప్ హై ధర్తీ ' పాటకొక గాంభీర్యాన్ని, తాత్విక భావనను ఆపాదిస్తుంది. హేమంత్ కుమార్ తప్ప మరెవరుపాడినా పాటలోని ఆధ్యాత్మిక భావన ఊహకుకూడా అందేదికాదు. ఇక్కడే సంగీత దర్శకుడు పాటకు తగిన గాయకుడిని ఎన్నుకోవటంలోని ప్రతిభ అర్ధమవుతుంది. హేమంత్ కుమార్ ఎస్డీ బర్మన్ కు మొత్తం 11 పాటలుపాడేడు. వాటిల్లో పది దేవ్ ఆనంద్ కే కావటం గమనార్హం.

అర్ధరాత్రి 'ఇత్ నీ హసీన్ ' పాట వింటూంటే మనసు అలవికాని ప్రేమ భావన కోసం తపిస్తుంది. ఒకరకమైన ఆనందంతో నృత్యం చేస్తుంది. అదే, 'చుప్ హై ధర్తీ' పాట వింటూంటే ప్రేమ భావనలోని ఆధ్యాత్మకతను అనుభవిస్తుంది. ప్రకృతి స్పందించే ప్రేమ భావన అనుభవిస్తూ, భూమిలో, ఆకాశంలో, నక్షత్రాలలో, వెన్నెలలో మనమూ ఒక భాగమై భగవంతుడి ప్రేమకోసం ఎదురు చూస్తున్న భావన కలుగుతుంది. టాగోర్ గీతాంజలిలోని కవితను సరళం చేసి ప్రేయసిని ప్రతీకగా తీసుకుని, ప్రేయసి కోసం తపనను, భగవంతుడి కోసం తపనగా చేసి రచించిన తాత్విక ప్రేమ గీతంలా అనిపిస్తుంది. 'తన్హాయి యోంకే సహారే , ఢూంఢ్ రహీ హై తుఝుకో సాథ్ హమారే, 'తుఝ్ బిన్ దూబే దిల్ కో కోన్ ఉభారే' వంటి వాక్యాలు తాత్వికార్థంతో పల్లవిస్తాయి. భౌతిక పరిధి దాటిన తీయని బాధను ఎదలో కలిగిస్తాయి. మానవ శరీర పరిధి విధించిన సంకెళ్ళను దాటి విస్తరించిన ప్రేమకోసం హృదయం అశ్రులు చాస్తుంది. ఇది అత్యద్భుతమైన కళాకారులు అత్యుత్తమ కళను, అత్యంత నిజాయితీతో సృజిస్తే తత్ఫలితంగా ఉద్భవించే కళ ప్రభావం. ఇలాంటి పాటలు వినటం, అనుభవించటం కూడా ఒక మాములు అనుభవ పరిధి దాటి ఆధ్యాత్మకానుభవ స్థాయికి ఎదుగుతుంది. పాటలు వింటూ ఎన్నో ఏళ్లు తపస్సు, సాధన చేసి తపన పడితేకానీ అనుభవానికి రాని సమాధిస్థితి భావన అనుభవించే వీలు కలుగుతుంది. ఇది సరస్వతి స్వరూపమైన సంగీత, సాహిత్యాల వల్ల కలిగే సిద్ధి.

**(వచ్చే నెల మరిన్ని రాత్రివేళ పాటలతో..)**

Post your comments